క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని కాలనీలతో పాటుగా ఫరూఖ్‌నగర్, నాగులపల్లి, రాసుమళ్లగూడ, కిషన్‌నగర్, హాజీపల్లి, చింపోడ్, దేవునిపల్లి, చౌలపల్లి, విశ్యాల, కంసాన్‌పల్లి, పీర్లగూడ, మొండోనిరాయి తండా, ఉప్పరిగడ్డ, పల్గుటతండా, సోలీపూర్, సాయి బాలాజీటౌన్, నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి, వీర్లపల్లి, మోత్కులగూడ, ఈదులపల్లి గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చెట్లకొమ్మల తొలగింపు కారణంగా..

కేశంపేట: 33కేవీ లైన్ కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా కేశంపేట ఫీడర్‌కు విద్యుత్ సరఫరా ఉండకపోవడంతో కేశంపేట సబ్‌స్టేషన్‌తో పాటు కొండారెడ్డిపల్లి, నిర్దవెళ్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో గ్రామస్తులు, రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

కళాశాల నిర్మాణానికి విరాళాల అందజేత



ఎమ్మెల్యేకు చెక్కులు అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి తమవంతు సహాయం చేసేందుకు పలువురు దాతలు ముందుకొచ్చి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన దండు శరత్‌బాబు, దండు వాసు రూ.5లక్షలు, తెలంగాణ లారీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ రూ.2,22,222లు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం రూ.1లక్షా 16వేలు, బీజేపీ నాయకుడు చెంది మహేందర్‌రెడ్డి రూ.1,11,111లు, విశ్రాంత ఉపాధ్యాయుడు, కాంగ్రెస్ నేత నర్సింహారెడ్డి రూ.75వేల చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు. విరాళాలు అందజేసిన దాతలను ఎమ్మెల్యే శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, అగ్గనూరు బస్వం, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మద్దూరు మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మద్దూరు మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ సహకార సంఘం డైరెక్టర్ రాంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో గొల్లగండ మైసమ్మ దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రజలు దేవాలయాల వద్దకు వెళ్లినప్పుడు నిష్టతో పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, బాల్‌రాజ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల మరమ్మతులకు సహకారం

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్‌లో గ్రామంలో సీసీ కెమెరాల మరమ్మతులకు గ్రామ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలు సోమవారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కాంతారెడ్డికి రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సర్దార్‌నగర్ గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలు సాంకేతిక లోపంతో గత సంవత్సరం నుంచి పనిచేయకపోవడంతో వాటి మరమ్మతులకు మాజీ సర్పంచ్ ముందుకురావడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా మండలంలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఇప్పటివరకు పలు కేసులు ఛేదించినట్లు తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందన్నారు.

'ఉపాధి' ప్రణాళిక

- **గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు**
- మండలంలో 41 గ్రామ పంచాయతీలు
- 8వేల జాబ్‌కార్డులు.. 4900 యాక్టివ్‌లో..
- ఈజీఎస్‌తో గ్రామాల అభివృద్ధి



నరెడ్లగూడలో గ్రామసభ నిర్వహిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: పేదలకు వందరోజులు పని కల్పించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టడానికి మండల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీలో ఎలాంటి పనులు చేపట్టాలన్న దానిపై మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు కూడా నిర్వహించారు. గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు. మండలంలో మొత్తం 8వేల జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 4900 కార్డులో యాక్టివ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

చేపట్టనున్న పనులు..

మురుగు నీరు రోడ్లపై పారకుండా ఇంకుడు గుంతలు, పశువుల దాహాన్ని తీర్చేందుకు నీటి తొట్టెలు, పాఠశాలలో వంట గదులు, టేకు మొక్కల పంపిణీ, రైతుల భూములు సారవంతం చేయడానికి చెరువు మట్టిని తరలించే పనులపై తీర్మానం చేశారు. కందకాల తవ్వకం, పంట చేల వద్దకు రోడ్ల నిర్మాణం, సాగు నీటి కాల్వల పూడికతీత తదితర పనులు చేపట్టనున్నారు.

పాత పనుల్లో నిమగ్నమైన అధికారులు..

2024–25 సంవత్సరానికి చెందిన పనులు అధికారులు ప్రస్తుతం పూర్తి చేస్తున్నారు. కొత్త పనులకు అప్లికేషన్లు తీసుకునే సమయంలో పాత వాటికే పరిమితమయ్యారు. గ్రామాల్లో గత సంవత్సరం ఎంపిక చేసిన పనులు చాలావరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. పలు గ్రామాల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి త్వరితగతిన పనులు చేపట్టాలని కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. గ్రామాల్లో ఏఏ పనులు చేయాలో, చేయాల్సిన పనుల వివరాలు సేకరించి త్వరలోనే ప్రారంభిస్తాం.

–వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రవినాయక్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికంగా కృషి చేస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ మూడే రవినాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వార్షిక ఫీజును పాఠశాల హెచ్‌ఎం రేణుకకు అందజేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులకు 2024–25 విద్యాసంవత్సరానికిగాను పరీక్ష ఫీజు 3,250 రూపాయలను అందించామన్నారు. దాత సుచిత్ర సహకారంతో గత ఐదు సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ఫీజు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, అలివేలమ్మ, మహేశ్వరి, జ్యోతి, శోభా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఫీజు అందిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్‌ఎఫ్ వరమని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీం భరత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామానికి చెందిన మాణిక్యంకు రూ.47వేల 500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని, ప్రజలంతా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో షాబాద్ మాజీ సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింహులు, కొమరబండ గ్రామ అధ్యక్షుడు సుభాష్, నాయకులు బర్ల యాదయ్య, చంద్రబోస్, మాధవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



బాధితుడికి చెక్కు అందజేస్తున్న భీంభరత్

దైవచింతన అలవర్చుకోవాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలను సోమవారం మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్లతో భక్తులు దేవాలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవం ప్రధాన అర్చకుడు రెవల్లి రాజుశర్మ ఆంజనేయస్వామి దేవాలయాన్ని జీర్ణోద్ధరణ గావించి యజ్ఞం నిర్వహించారు. ఈ యజ్ఞంలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ నెల 25 నుంచి 28వరకు సీతారామాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామిజీ హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న సమగ్ర సర్వే

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు

షాబాద్: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ, సోలీపేట్, మాచన్‌పల్లి, సంకెపల్లిగూడ తదితర గ్రామాల్లో చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు, ప్రజలతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన విధంగా సర్వే సమూనా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ, ఆర్థిక, రాజకీయ సర్వేను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈనెల 18వ తేదీవరకు గ్రామంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను సర్వేలో పొందుపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏఓ వెంకటేశం తదితరులు ఉన్నారు.

తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలి

శంకర్‌పల్లి: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో అధికారులు తప్పులకు తావు లేకుండా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మున్సిపాలిటీలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద జరుగుతున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల వద్ద పక్కా సమాచారం సేకరించాలని, వివరాలు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వేలో ఎలాంటి సమస్యలు తలెత్తినా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



షాబాద్: సోలీపేట్ గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

పకడ్బందీగా నిర్వహించాలి

షాద్‌నగర్ రూరల్: సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రామారావు అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల, కొంగగూడ, మేళ్లగూడ, బుచ్చిగూడ గ్రామాల్లో చేపడుతున్న సర్వేను అధికారి రామారావు పరిశీలించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ.. కుటుంబ వివరాల సేకరణలో అధికారులు తప్పులను నమోదు చేయొద్దని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ప్రజల స్థితిగతులను తెలుసుకోవడంతో పాటుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకునేందుకు ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. సమగ్ర కులగణనతో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి, సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రామారావు



శంకర్‌పల్లి: డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సమన్వయంతో పనిచేయాలి



మార్కెట్ కమిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న భారతీయ కిసాన్ సంఘం సభ్యులు

భారతీయ కిసాన్ సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: రైతు సమస్యలపై మార్కెట్ కమిటీలు, వ్యవసాయ శాఖలు సమయన్వయంతో పనిచేస్తే మేలు జరుగుతుందని భారతీయ కిసాన్ సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం భారతీయ కిసాన్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై తమ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులందరూ చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు, చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములును మార్కెట్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో రైతుల సమస్యలపై చర్చించారు. రైతు పంటల దిగుబడులు వచ్చే సమయంలో మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటేనే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. దీనిపై స్పందించిన నూతన చైర్మన్ పెంటయ్యగౌడ్ మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మార్కెట్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉంటామన్నారు. వ్యవసాయశాఖ, మార్కెట్ శాఖ రైతులకు అందుబాటులో ఉంటే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. భారతీయ కిసాన్ సంఘం ద్వారా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడూ అధికారులు, చైర్మన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో సంఘం మండల కమిటీ అధ్యక్షుడు మల్‌గారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి వీరేశం, రైతులు విశ్వనాథ్, కృష్ణయ్య, శ్రీనివాస్, నర్సింలు తదితరులు ఉన్నారు.

వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురంలో సోమవారం బొడ్రాయి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో బొడ్రాయి వద్దకు చేరుకొని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కన గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.



బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం



నాబిశిల చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయ నాలుగో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు అశోక్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు నాబిశిలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామస్తులు పాల్గొన్నారు

రైతు సంక్షేమమే ధ్యేయం

- ఇచ్చిన మాట ప్రకారం సన్నధాన్యానికి రూ.500 బోనస్
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తాము పండించిన పంటలను రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం అందించే మద్దతు ధరను ప్రతీ రైతుకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి సుధాకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరస్వతి, అగ్రికల్చర్ ఏడీ రాజారత్నం, ఏఓ నిషాంత్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్, వైస్‌చైర్మన్ పాండురంగారెడ్డి, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, నాయకులు బాబర్‌అలీఖాన్, బాబునాయక్, శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, సాధిక్, ఇబ్రహీం, పీఏసీఎస్ సెక్రటరీ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: ఎలికట్టలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

దళారులను నమ్మి మోసపోవద్దు

కొందుర్గు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇచ్చిన మాట ప్రకారం సన్నవడ్లకు రూ.500ల బోనస్ ఇస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చే రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, ఏఈఓ ధ్రువపత్రం తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా కొందుర్గులో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, కృష్ణారెడ్డి, సింగిల్ విండో సీఈఓ మహిమూద్ శరీఫ్, నాయకులు చంద్రశేఖర్, సత్యనారాయణ రెడ్డి, ఆంజనేయులు, పురుషోత్తంరెడ్డి, మల్లేశ్‌గౌడ్, గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.5లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ గంటకు 250 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుందని వివరించారు. విద్యార్థులు కలుషిత నీరు తాగి రోగాలకు గురికాకుండా ఉండేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందకర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గాయత్రి, జీహెచ్‌ఎం గోపినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేగూరులో..

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో సోమవారం పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు రుణమాఫీ చేసి ఆదుకున్నామని, ఉమ్మడి చేగూరు గ్రామంలో సుమారు 80 శాతం మేర రుణమాఫీ జరిగిందని, మిగతా 20 శాతం మేర టెక్నికల్ సమస్యలతో రుణమాఫీ జరగకపోవచ్చన్నారు. అర్హులైన వారందరికీ తప్పకుండా రుణమాఫీ చేసితీరుతామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, డైరెక్టర్లు ముత్యాల నర్సింహాగౌడ్, నర్సింహ, సాములయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, జెట్ట కుమార్, మండల వ్యవసాయాధికారి వాణి, సీఈఓ వెంకటయ్య, ఏఈఓ రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.